

పార్సిల్ సర్వీస్ ప్రారంభం
భారతీయ రైల్వే శాఖ, తపాలా శాఖ సంయుక్తంగా జాయింట్ పార్సిల్ ప్రొడక్ట్ సేవలను ప్రారంభించాయి. 8లో



ముస్తాబవుతున్న స్టేడియం
భారత్-ఆస్ట్రేలియా వన్డే మ్యాచ్‌కు వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియం ముస్తాబవుతోంది. 8లో



డీఎస్సీ-98 అభ్యర్థుల ఖుషీ
ఉపాధ్యాయుడిగా పనిచేయాలన్న డీఎస్సీ-1998 అభ్యర్థుల కల నెరవేరే సమయం ఆసన్నమైంది. 8లో

పట్టభద్రుల పట్టం ఎవరిదో?



పట్టభద్రుల తరపున చట్టసభలో ఉత్తరాంధ్ర నుంచి ప్రాతినిధ్యం వహించనున్న నాయకుడెవరో నేడు తేలనుంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభించనున్నారు. 37 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని 1,119 బ్యాలెట్ బాక్సుల్లో 2,00,926 మంది నిక్షిప్తం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో లెక్క తేలితే.. 36 గంటల్లోపే ఫలితం వెలువడే అవకాశం ఉంది. లేదంటే 48 గంటల సమయం దాటనుంది. ఇందుకు తగినట్లుగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



స్వర్ణభారతి స్టేడియంలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

- నేడు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
- స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్‌కు 28 టేబుళ్లు ఏర్పాటు
- పోలైన ఓట్లు 2,00,926.. లెక్కింపు సిబ్బంది 560 మంది
- మొదటి ప్రాధాన్యత ఓటుతో ఫలితం వస్తే ఆనందమే..
- లేదంటే రెండు రోజుల పాటు కౌంటింగ్ జరిగే అవకాశం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం : ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం ఉదయం 8 గంటలకు మొదలవుతుంది. తుది ఫలితం తేలటానికి సుదీర్ఘ సమయం పడుతుందని అధికారులు భావిస్తున్నారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు గురువారం అర్ధరాత్రికి పూర్తవుతుందని అంచనా. ఓట్ల లెక్కింపులో పాల్గొనే అధికారులు, సిబ్బందికి షిఫ్టులవారీగా విధులు కేటాయించారు. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వద్ద 6 జిల్లాలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ముందుగా ఎన్నికల అబ్జర్వర్ సిద్ధార్థజైన్, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ మల్లికార్జున, ఏఆర్వోగా వ్యవహరిస్తున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి, 6 జిల్లాల డీఆర్వోలు, నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్‌లకు వేసిన సీళ్లను ఓపెన్ చేస్తారు. ర్యాండమ్‌గా బ్యాలెట్ బాక్సులను ఎంపిక చేసి, తెరవనున్నారు. ఇప్పటికే దీనిపై సిబ్బందికి రెండు విడతల శిక్షణ పూర్తి చేశారు. మొత్తం 28 టేబుళ్లను లెక్కింపునకు ఏర్పాటు చేశారు. 560 మంది సిబ్బందిని నియమించగా.. వీరికి ఒక్కో షిఫ్ట్‌కు 280 మంది చొప్పున విధులను కేటాయించారు. వీరితో పాటు సహాయకులుగా మరో 50 మందికి పైగా సిబ్బంది, అధికారులు కౌంటింగ్ విధుల్లో పాల్గొననున్నారు. ఇప్పటివరకు 280 మంది ఏజెంట్లకు పాస్‌లు జారీ చేశారు.

లెక్కింపు ప్రక్రియలో ఆరు దశలు

స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఇప్పటికే కౌంటింగ్ కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పూర్తిగా ఎన్‌క్లోజర్స్ నడుమ ఎన్నికల సిబ్బంది కౌంటింగ్ నిర్వహిస్తారు. బ్యాలెట్ బాక్స్‌ను తెరిచే ముందు సంబంధిత ఏజెంట్లకు చూపిస్తారు. బ్యాలెట్ బాక్సులపై ఎలాంటి ట్యాంపరింగ్ కనిపించినా వెంటనే ఎన్నికల అధికారికి తెలియజేస్తారు. లెక్కింపు ప్రక్రియలో బ్యాలెట్ పేపర్ల లెక్కింపు, బ్యాలెట్ బాక్స్ సీల్ చెక్ చేయడం, పరిశీలన, చెల్లుబాటు ఓట్ల లెక్కింపు, ఎలిమినేషన్, డిక్లరేషన్ మొదలైన 6 దశలుంటాయి. లెక్కింపు సమయంలో ప్రతి రౌండ్ అనంతరం అభ్యర్థుల, ఏజెంట్ల సంతకాలు తీసుకుంటారు. మొదటగా జారీ చేసిన 756 పోస్టల్ బ్యాలెట్లను ఓపెన్ చేస్తారు. అందులో చెల్లని ఓట్లను మినహాయించి, మిగిలిన వాటిని బ్యాలెట్ బాక్సుల్లో కలిపేస్తారు. అనంతరం బ్యాలెట్ బాక్సుల నుంచి మొదట 25 చొప్పున బ్యాలెట్ పత్రాలను కట్టలుగా కడతారు. ఇందుకోసం చాలా సమయం పట్టే అవకాశం ఉంది. కట్టలు కట్టిన బ్యాలెట్ పత్రాలను తెరిచి, చెల్లనివి, చెల్లుబాటయ్యే ఓట్లను రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో వేరు చేస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్లను అభ్యర్థుల వారీగా లెక్కిస్తారు. ఈ ప్రక్రియ బ్యాచ్‌ల వారీగా జరుగుతుంది. ఒక్కో బ్యాచ్ లెక్కింపునకు గంటన్నర సమయం పట్టే అవకాశం ఉంది. మొత్తం ఓట్లు లెక్కించటానికి ఏడెనిమిది గంటల సమయం పడుతుంది.

మాక్ కౌంటింగ్ నిర్వహణ

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం స్టేడియంలో ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులు, కౌంటింగ్ సిబ్బందికి ఆర్వో, కలెక్టర్ ఎ.మల్లికార్జున, జేసీ విశ్వనాథన్ మాక్ కౌంటింగ్ నిర్వహించారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విజయం మాదే.. : పోలింగ్ ముగిసిన తర్వాత నుంచి ఏయే ప్రాంతాల్లో ఎంత పోలింగ్ నమోదయిందన్న అంశాలపై ఆయా పార్టీల మద్దతు అభ్యర్థులు గెలుపు విశ్లేషణలతో బిజీగా మారిపోయారు. జిల్లాలు, బూత్‌లవారీగా పోలైన ఓట్ల ద్వారా వారి మద్దతు అభ్యర్థులు ఎంత మేర అనుకూలంగా ఓటు వేశారనే అంశాలపై బేరీజు వేసుకున్నారు. ఏదేమైనా ఓటరు ఎవరివైపు మొగ్గు చూపుతున్నారనేది గురువారం రాత్రికి లేదా శుక్రవారం తెలియనుంది. అప్పటి వరకు ఉత్కంఠతను భరించాల్సిందే..!

కౌంటింగ్ భిన్నం.. అందుకే ఆలస్యం

సాధారణ ఎన్నికల కౌంటింగ్‌లో రౌండ్లవారీగా ఓట్ల లెక్కింపు ఉంటుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్‌లో ప్రాధాన్యత అంకెల ప్రాతిపదికన రౌండ్లు ఉంటాయి. ఒకటో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయితే మొదటి రౌండ్ పూర్తయినట్టు పరిగణిస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత ఎన్నికల్లో అభ్యర్థి గెలుపునకు కావాల్సిన కోటా ఓట్లు ఎన్ని అనేది తేలుతుంది. తొలి రౌండ్‌లో మొదటి ప్రాధాన్యత ఓట్లు ఎవరికెన్ని వచ్చాయనేది నిర్ధారిస్తారు. చెల్లని ఓట్లను పక్కన పడేస్తారు. చెల్లిన వాటిలో 50 శాతం ఓట్లకు ఒకటి కలిపితే ఎన్ని ఓట్లవుతాయో.. దాన్నే కోటా(అభ్యర్థి గెలుపునకు కావాల్సిన ఓట్లు)గా నిర్ధారిస్తారు. మొత్తం 2,00,926 ఓట్లు పోలయ్యాయి. ఇందులో చెల్లని ఓట్లుపోగా మిగిలిన వాటిలో 50 శాతానికి, ఒక ఓటును అదనంగా కలుపుతారు. ఆ లెక్క మేరకు ఎవరికైతే అన్ని ఓట్లు వస్తాయో వారిని విజేతగా నిర్ణయిస్తారు. మొదటి ప్రాధాన్యతా ఓట్లలో ఆ సంఖ్యకు ఎవరూ చేరుకోకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. అపుడు బరిలో ఉన్న 37 మంది అభ్యర్థుల్లో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని ఎలిమినేట్ చేసి.. ఆ వ్యక్తికి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లను గణిస్తారు. ఈ విధంగా కోటా ఓట్లు వచ్చే వరకు అతి తక్కువ ఓట్లు వచ్చిన వారిని ఎలిమినేట్ చేస్తూ.. లెక్కింపును కొనసాగిస్తారు. చివరికి ఇద్దరు అభ్యర్థులు మిగిలే వరకు కోటా ఓట్లను చేరుకోకపోతే.. అపుడు ఆ ఇద్దరిలో ఎవరికి ఎక్కువ ఓట్లు వచ్చాయో.. వారినే విజేతగా ప్రకటించి, కౌంటింగ్ నిలుపుదల చేస్తారు. ఈ కారణంగా ఫలితం వచ్చే సరికి చాలా ఆలస్యమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తొలిరోజు హాజరు 97.56%

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ప్రారంభం



బీవీకే కాలేజీ వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



బుల్లయ్య కాలేజీ కేంద్రంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 128 కేంద్రాల్లో తెలుగు/సంస్కృతం పరీక్ష జరిగింది. మొత్తంగా 58,768 మంది విద్యార్థులకు 57,333 మంది పరీక్షకు హాజరయ్యారు. 97.56 శాతం మంది పరీక్ష రాసినట్లు ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి పి.ఉమారాణి వెల్లడించారు. 8లో

విశాఖ డెయిరీ పాల ధర లీటరుకు రూ.2 పెంపు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ డెయిరీ పాల ధరలు పెరిగాయి. పెరిగిన పాల ధరలు గురువారం నుంచి అమల్లోకి రానున్నాయని డెయిరీ యాజమాన్యం వెల్లడించింది. 500 ఎంఎల్ పాల ప్యాకెట్‌పై రూ.1, లీటరు ప్యాకెట్‌పై రూ.2 పెరిగినట్లు పేర్కొంది.

50 వాహనాలపై కేసుల నమోదు

గోపాలపట్నం: నగరంలోని పలు చోట్ల బుధవారం రవాణా శాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లు ఉన్న 50 వాహనాలపై కేసులు నమోదు చేశామని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. మద్దిలపాలెం, అగనంపూడి పరిసర ప్రాంతాల్లో ఎంవీఐలు కె.ప్రవీణ్ కుమార్, జి.సత్యంనాయుడు, కె.శ్రీనివాస్, ఏఎంవీఐ శిరీషా దేవి తనిఖీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. హై సెక్యూరిటీ ప్లేట్లు కావాలంటే https://aprtacitizen.epragathi. org/#!/ Hsrpbookingslot ను సందర్శించాలని సూచించారు. నాలుగు చక్రాల వాహనానికైతే రూ.620, ద్విచక్రవాహనానికైతే రూ.245 రుసుం చెల్లించాలని తెలిపారు. అదే రోజు ఈ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవచ్చని వెల్లడించారు.

లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రికి లారస్ రూ.25 లక్షల విరాళం

ఎంవీపీకాలనీ: నగరంలోని లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రికి లారస్ లాబ్స్ రూ.25 లక్షల విరాళం అందజేసినట్లు ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ వి.ఉమామహేశ్వరరావు వెల్లడించారు. లారస్ ల్యాబ్స్ సీఈవో డాక్టర్ చావా సత్యనారాయణ ఈ మేరకు విరాళం అందజేసినట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో క్యాన్సర్ చికిత్సలో మరింత ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు. భారీ విరాళం ప్రకటించడంపై లారస్ ల్యాబ్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ కౌంటింగ్‌కు ట్రాఫిక్ మళ్లింపు

దొండపర్తి : ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు పోలీస్ శాఖ పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. మరోవైపు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపడుతోంది. గురువారం ఉదయం 8 గంటల నుంచి స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ఆ పరిసర ప్రాంతాల్లో పాక్షిక ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కౌంటింగ్ దృష్ట్యా స్టేడియం పరిసర ప్రాంతంలో వాహనాలు అధికంగా వచ్చే అవకాశం ఉండడంతో ఆయా ప్రాంతాల నుంచి వెళ్లే వారు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

- కౌంటింగ్‌కి వచ్చే సిబ్బంది వాహనాలను బుల్లయ్య కాలేజ్ నార్త్ గేటు (రేసపువానిపాలెం) నుంచి వెళ్లి, వారికి కేటాయించిన పార్కింగ్ స్థలంలో వాహనాలను నిలపాలి. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలను బుల్లయ్య కాలేజ్ బాస్కెట్ బాల్ గ్రౌండ్ వద్ద పార్క్ చేయాలి.
- స్వర్ణభారతి జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా బుల్లయ్య కాలేజ్ జంక్షన్ నుంచి స్వర్ణభారతి జంక్షన్ వరకు సాధారణ వాహనాలను అనుమతించరు. వారు రామా టాకీస్ జంక్షన్ నుంచి ప్రయాణించాల్సి ఉంటుంది.
- మద్దిలపాలెం జంక్షన్ నుంచి రామాటాకీస్ జంక్షన్ వరకు రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అత్యవసర వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలి.
- ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్‌కి వచ్చే విద్యార్థులు సత్యం జంక్షన్ నుంచి వచ్చి బుల్లయ్య కాలేజీ మెయిన్ గేటు వద్దకు చేరుకోవాలి.
- స్వర్ణభారతి స్టేడియం చుట్టు పక్కల ఎటువంటి వాహనాలు నిలపకూడదు.
- రామాటాకీస్ నుంచి మద్దిలపాలెం వైపు, మద్దిలపాలెం నుంచి రామాటాకీస్ వెళ్లే వాహనాలను సత్యం జంక్షన్ మీదుగా ప్రయాణించాలి.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి

ఓపీఎస్ అమలు డిమాండ్‌తో 26న సదస్సు




మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి

మహారాణిపేట: నూతన పెన్షన్ విధానాన్ని(ఎన్‌పీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానం(ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎన్జీవోస్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డి తెలిపారు. కలెక్టర్ ఆఫీస్ సమీపంలోని ఎన్జీవోస్ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కోల్‌కతాలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం కేంద్ర రాష్ట్ర ఉద్యోగుల ఏడు డిమాండ్ల సాధనకు సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం, ఖాళీ పోస్టులను భర్తీ, రైల్వే, స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 53 లక్షల మంది ఉద్యోగుల పెన్షన్లను షేర్ మార్కెట్‌లో పెట్టిందని.. ఉద్యోగులు రిటైర్ అయిన తర్వాత పెన్షన్లకు గ్యారెంటీ లేకుండా చేసే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. చివరకు సైనికులను కూడా కాంట్రాక్ట్ పద్ధతిలో నియమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు కె.ఈశ్వరరావు, ఆర్.రవిశంకర్, పి.గోపాలకృష్ణ, డి.రమేష్ బాబు, సత్తి బాబు, ఎ.వి.ఎస్.ఎస్.వి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అనధికార సైరన్ల ఆటకట్టు!

- సైరన్ల దుర్వినియోగంపై సీరియస్
- ఇకపై అలాంటి వాహనాల సీజ్
- పర్మిట్ల తాత్కాలిక రద్దుకు చర్యలు
- స్పెషల్ డ్రైవ్‌కు రవాణా శాఖ సన్నద్ధం



సాక్షి, విశాఖపట్నం: రోడ్లపై సైరన్లు మోగించుకుంటూ రయ్‌రయ్‌మంటూ కొన్ని వాహనాలు దూసుకుపోతుంటాయి. ఆ వాహనాలు ఏ వీవీఐపీలవో, మంత్రులవో అనుకుని ముందు వెళ్లే వాహన చోదకులు పక్కకు తప్పుకుంటారు. కానీ సైరన్లు మోగించుకుంటూ పరుగులు తీసే వాహనాలన్నీ వీవీఐపీవీ, మంత్రులవీ కావు. వీటిలో అనధికారికంగా సైరన్లు ఏర్పాటు చేసుకున్నవి కూడా ఉంటున్నాయి. ఎక్కడైనా సైరన్ మోగించుకుంటూ వెళ్తున్న ఇలాంటి అనధికార వాహనాలను రవాణాశాఖ అధికారులు ఆపడానికి ప్రయత్నాలు చేస్తున్నా ఆపకుండా వెళ్లిపోనిస్తున్నారు. అంతే కాదు.. టోల్‌ప్లాజాల వద్ద కూడా సైరన్ కొడుతూ ఫీజు చెల్లించకుండా వుడాయిస్తున్నారు. సైరన్ మోగిస్తుండడంతో టోల్‌ప్లాజాల సిబ్బంది కూడా వీవీఐపీ వాహనాలుగా భావించి నిలువరించకుండా పంపించి వేస్తున్నారు. ఇలాంటివి గతంలో నామమాత్రంగా ఉండేవి. ఇప్పుడవి లెక్కకు మిక్కిలి ఉంటున్నాయి. ఈ తరహా వాహనాలు రోజు రోజుకూ అధికమవుతున్నట్టు ఫిర్యాదులొస్తున్నాయి. దీంతో అప్రమత్తమైన రవాణా శాఖ అధికారులు అనధికార సైరన్ వాహనాలపై కొరడా ఝుళిపించడానికి సన్నద్ధమవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై సైరన్లతో తిరిగే వాహనాల పని పట్టేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ అనధికార సైరన్ వాహనాలను సీజ్ చేయనున్నారు. అంతేకాదు.. సంబంధిత వాహనం డ్రైవర్/యజమాని డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేస్తారు. అలాగే ఆ వాహనం పర్మిట్‌ను కూడా తాత్కాలికంగా క్యాన్సిల్ చేస్తామని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ రాజారత్నం తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తమ వాహనాలకు అనధికారికంగా అమర్చిన సైరన్లను తక్షణమే తొలగించుకోవాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనధికార సైరన్ కలిగి ఉన్న వాహనాలను గుర్తించడానికి స్పెషల్ డ్రైవ్ చేపడతామని చెప్పారు.

సైరన్ అనుమతుల పరిశీలన

మరోవైపు సైరన్‌తో వెళ్లే వాహనాల నంబర్లను తీసుకుంటారు. ఆ వాహనానికి సైరన్ అనుమతి ఉందో లేదో రికార్డులను పరిశీలిస్తారు. లేనిపక్షంలో కేసు నమోదు చేస్తారు. అలాగే రవాణా శాఖ తనిఖీ సమయంలోనూ తప్పించుకుని పోయే ప్రయత్నం చేస్తే పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయనున్నారు.

ఈ వాహనాలకు సైరన్ ఓకే..

కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం.. అంబులెన్స్‌లు, ఫైర్ ఫైటింగ్ వాహనాలు, గవర్నర్లు, కేంద్ర, రాష్ట్రాల మంత్రులు, ఎంపీల కాన్వాయ్‌లు, ఇతర ముఖ్య నాయకుల భద్రత కాన్వాయ్‌లు, న్యాయమూర్తుల వాహనాలు, పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, మోటార్ వెహికల్ శాఖ ఉన్నతాధికారులు విధి నిర్వహణలో వెళ్లే వాహనాలకు ఈ సైరన్ అనుమతిస్తారు.

డీఎస్సీ-98 అభ్యర్థుల ఖుషీ

- పోస్టింగ్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- ఉమ్మడి విశాఖలో 413 మందికి అవకాశం
- ఏకోపాధ్యాయ స్కూళ్లకు కేటాయింపు
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ఆశావాహులు

విశాఖ విద్య : డీఎస్సీ–1998లో ఎంపికైన అభ్యర్థులకు ఎట్టకేలకు ఉద్యోగాలు దక్కనున్నాయి. ఉపాధ్యాయుడిగా పనిచేయాలనే కల నెరవేరే సమయం ఆసన్నమైంది. క్వాలిఫైడ్ అభ్యర్థులకు మినిమమ్ టైమ్ స్కేల్‌తో పోస్టింగ్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల కోసమని ఎదురుచూస్తున్న అభ్యర్థులు తాజా పరిణామాలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 905 మంది డీఎస్సీ–98లో అర్హత సాధించారు. గత పాలకులెవ్వరూ వీరి గురించి పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో వీరికి ఉపాధ్యాయ పోస్టులు ఇస్తామని హామీ ఇచ్చారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభించటంతో వీరికి ఉద్యోగాలు ఇచ్చేందుకు విద్యాశాఖాధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు. విద్యాశాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన ఆదేశాలతో డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల అన్ని రకాల ధృవీకరణ పత్రాలను గతేడాది అక్టోబర్‌లో పరిశీలించారు. అభ్యర్థుల నుంచి అంగీకార పత్రాలను సేకరించారు. వీరిలో 413 మంది ఉపాధ్యాయ పోస్టుల్లో చేరేందుకు, ముందుకొచ్చారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు జాబితాను కమిషనర్ కార్యాలయానికి నివేదించారు. తాజా ఉత్తర్వులతో త్వరలోనే మినమిమ్ టైం స్కేల్ కింద వీరికి పోస్టింగ్‌లు దక్కనున్నాయి. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో వీరికి పోస్టింగ్‌లు ఇచ్చేలా విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలన చేస్తున్నారు.

జాబితా సిద్ధం



డీఎస్సీ–98 క్వాలిఫైడ్ అభ్యర్థుల నుంచి అంగీకార పత్రాలను తీసుకొని ఇదివరకే కమిషనర్‌కు నివేదించాం.ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటాం. పాఠశాలల్లో బోధనకు ఆటంకం లేకుండా తగిన శ్రద్ధ తీసుకుంటున్నాం. – ఎల్.చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

హర్షించదగ్గ విషయం



ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. పాఠశాలలను అభివృద్ధి చేయటంతో పాటు, ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల భర్తీపై కూడా ఎప్పటికప్పుడు శ్రద్ధ చూపుతుండటం హర్షనీయం. డీఎస్సీ–98 అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేయటం ద్వారా ప్రభుత్వం మరోమారు తన చిత్తశుద్ధిని చాటుకుంది.

– చొక్కాకుల సూర్యనారాయణ, వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు, విశాఖ జిల్లా

24 ఏళ్ల కల నెరవేరింది



డీఎస్సీ–98లో అర్హత సాధించిన మేము, ఉద్యోగాల కోసమని 24 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. మాకు ఉద్యోగాలు ఇస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఇన్నాళ్లకు మా కల నెరవేరుతుంది.

– కె.ఎల్.శ్రీనివాస్, క్వాలిఫైడ్ అభ్యర్థి, విశాఖపట్నం

వైద్యురాలి ఆత్మహత్యాయత్నం

అల్లిపురం: ప్రియుడు మోసం చేశాడని ఓ వైద్యురాలు.. అతని ఇంటి వద్ద నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ విజయకుమార్ తెలిపిన వివరాలివీ.. రాజమహేంద్రవరం జిల్లా చొప్పల్లి గ్రామానికి చెందిన ఎస్.దేవి వైద్యురాలు. మ్యాట్రిమోనియల్ యాప్ ద్వారా ఈఎస్ఐ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఆరిలోవ ప్రాంతానికి చెందిన ప్రేమ్‌చంద్ అనే చిన్నపిల్లల డాక్టర్‌తో పరిచయం పెంచుకుంది. ఇద్దరు పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఆమె డాబాగార్డెన్స్‌లోని ప్రేమ్‌చంద్ ఇంటికి వెళ్లింది. అప్పటికే ఆయనకు పెళ్లి జరిగినట్లు తెలుసుకుంది. దీంతో ఆమె నిద్రమాత్రలు అధిక మొత్తంలో మింగేయడంతో అపస్మారక స్థితిలోకి చేరుకుంది. స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్.ఐ విజయకుమార్ తన సిబ్బందితో కలసి అక్కడకు చేరుకుని ఆమెను కేజీహెచ్‌కు తరలించారు. వైద్యులు ఆమెకు చికిత్స చేయడంతో కోలుకుంది. పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న ఆమె తండ్రి రాజమహేంద్రవరం నుంచి నగరానికి చేరుకున్నారు. కేజీహెచ్ నుంచి డిశ్చార్జి అయిన తర్వాత బుధవారం ఉదయం టూటౌన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నగరంలో నేడు

- ఉదయం 10:30 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి
- ఉదయం 11 గంటలకు ఎంవీపీ కాలనీ గాదిరాజు పేలస్‌లో ఇండస్ట్రియల్ అండ్ ఇంజనీరింగ్ ఎక్స్‌పో

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.57,870
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.53,050
వెండి(కిలో):	రూ.72,500

తొలిరోజు హాజరు 97.56 శాతం

- ప్రశాంతంగా ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు
- ఏడు మాల్ ప్రాక్టీస్ కేసుల నమోదు
- నేటి నుంచి సెకండియర్ పరీక్షలు



గోపాలపట్నం ఎస్‌వీఎల్‌ఎన్ కాలేజీలో నంబర్ చూసుకుంటున్న విద్యార్థి



బుల్లయ్య కాలేజీలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 128 కేంద్రాల్లో తెలుగు/ సంస్కృతం పరీక్ష జరిగింది. విద్యార్థులను కేంద్రాల్లోకి అరగంట ముందు నుంచే అనుమతించారు. కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించిన పోలీసులు ప్రతీ విద్యార్థిని పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన తరువాతనే కేంద్రాల్లోకి అనుమతించారు. తొలిరోజు కావడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, వారి సహాయకులు కేంద్రాల వద్దకు తోడుగా వచ్చారు. దీంతో పరీక్ష కేంద్రాల వద్ద సందడిగా కనిపించింది. కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించారు. అన్ని కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఉమారాణి విశాఖ నగరంలోని పలు కేంద్రాలను తనిఖీ చేసి, పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులకు తగిన సూచనలు చేశారు.

97.56 శాతం హాజరు

ఇంటర్మీడియట్ ఫస్టియర్ జనరల్ కోర్సు 53,625 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వీరిలో 1,061 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 5,143 మందికి గానూ 374 మంది గైర్హాజరు అయ్యారు. మొత్తంగా 58,768 మంది విద్యార్థులకు 57,333 మంది పరీక్షకు హాజరయ్యారు. 97.56 శాతం మంది పరీక్ష రాసినట్లు ఆర్‌ఐవో ఉమారాణి వెల్లడించారు. అప్పర్ సీలేరు కేంద్రంలో ఒకరు, చింతపల్లిలో ఆరుగురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడ్డారు.



పరీక్ష రాసేందుకు వెళ్తున్న కుమార్తెకు ముద్దుపెట్టి ఆశీర్వదిస్తున్న తల్లి



పిల్లల కోసం వేచి చూస్తున్న తల్లులు

నేడు సెకండియర్ పరీక్షలు ప్రారంభం

ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు గురువారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 361 జూనియర్ కాలేజీల్లో చదువుతున్న 56,720 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో బాలురు 27,341 మంది, బాలికలు 29,379 మంది ఉన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించనందున, కేంద్రాల్లోకి ముందుగానే విద్యార్థులు చేరుకోవాలని ఆర్‌ఐవో ఉమారాణి సూచించారు. విద్యార్థులకు ఉచితంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



జీవీకే కాలేజీలో తనిఖీ చేస్తున్న మహిళా పోలీస్



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థినులు

20 నిమిషాల ఆలస్యంగా ప్రశ్నాపత్రం

తగరపువలస: జీవీఎంసీ నాలుగో వార్డు కొత్త పరదేశిపాలెంలోని ఈస్టర్న్ విశాఖ జూనియర్ కళాశాల కేంద్రంలో బుధవారం పరీక్ష రాసిన మొదటి సంవత్సరం విద్యార్థులకు 20 నిమిషాల ఆలస్యంగా ప్రశ్నాపత్రం అందింది. నిబంధనల ప్రకారమే విద్యార్థులు 8.45 నుంచి పరీక్ష కేంద్రంలో తమకు కేటాయించిన గదులకు చేరుకున్నారు. అయితే తొలిరోజు సంస్కృతం, తెలుగు పేపర్ల ప్రశ్నాపత్రాలు విద్యార్థులకు అందడంతో జాప్యం జరిగింది. పరీక్ష ముగింపు సమయం పూర్తయినా విద్యార్థులు బయటకు రాకపోవడంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. 12.23 వరకు గేటు వద్ద ఎదురు చూశారు. ఆ తర్వాత విద్యార్థులు బయటకు వచ్చారు. దీనిపై ఆర్‌ఐవో పి.ఉమారాణి వివరణ కోరగా.. ఒక్కోసారి ప్రశ్నాపత్రాల చేరవేతకు ట్రాఫిక్ సమస్య కారణమవుతుందన్నారు. ఈస్టర్న్ విశాఖ జూనియర్ కళాశాలకు ప్రశ్నాపత్రాలు తరలించే సమయంలో అదే సమస్య ఎదురైందని.. విద్యార్థులకు అదనంగా 20 నిమిషాల సమయం కేటాయించినట్లు చెప్పారు.

నేటి నుంచి ఇండస్ట్రియల్ ఎక్స్‌పో



ఎక్స్‌పో వివరాలు వెల్లడిస్తున్న ఆర్కే అగర్వాల్

డాబాగార్డెన్స్: ఎంఎస్ఎంఈ అనుమతితో ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఇండస్ట్రియల్ అండ్ ఇంజినీరింగ్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు ఇండోర్ ఇన్ఫోలైన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.కె. అగర్వాల్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన ఈ ఎక్స్‌పో వివరాలు వెల్లడించారు. బీచ్‌రోడ్డు గాదిరాజు ప్యాలస్ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇండ్ ఎక్స్‌పోలో పాల్గొన్న వారికి మార్గదర్శకాల ప్రకారం శతశాతం సబ్సిడీ కల్పిస్తారని చెప్పారు. దేశం నలుమూలల నుంచి సుమారు 10 వేల మంది సందర్శకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్, ముంబయి, బెంగళూరు, చెన్నై, న్యూఢిల్లీ, కోల్‌కతా, నాగపూర్ వంటి నగరాల నుంచి వచ్చిన 100 మందికి పైగా ఎగ్జిబిటర్స్ వారి ఉత్పత్తులను ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ ఎక్స్‌పో ఉదయం 11 నుంచి రాత్రి 7 గంటల వరకు ఉంటుందని, ప్రవేశం ఉచితమన్నారు.

చేనేత ఉత్పత్తుల ప్రదర్శనకు విశేష స్పందన



చేనేత ఉత్పత్తులను తిలకిస్తున్న సందర్శకులు

బీచ్‌రోడ్డు: క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత హస్త కళా ఉత్పత్తుల ప్రదర్శనకు నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ బజార్ పేరుతో దసపల్లా హిల్స్‌లోని గాంధీ కమ్యూనిటీ సెంటర్‌లో బుధవారం ఈ ప్రదర్శనను ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ప్రదర్శనలో బొబ్బిలి చీరలు, పొందూరు ఖాదీ వస్త్రాలు, కళాఖండాలు, స్కోల్ అండ్ మార్బుల్ గులక రాళ్లు, చేతితో కళాత్మకంగా తయారు చేసిన అనేక రకాల ఆకృతులు, తాటాకు బుట్టలు తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. గురు, శుక్రవారాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

జాయింట్ పార్సిల్ సర్వీస్ ప్రారంభం

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో భారతీయ రైల్వే శాఖ, తపాలా శాఖ సంయుక్తంగా జాయింట్ పార్సిల్ ప్రొడక్ట్(రైల్ పోస్ట్ గతిశక్తి ఎక్స్‌ప్రెస్) సేవలను ప్రారంభించాయి. విశాఖ నుంచి లోకమాన్య తిలక్ టెర్మినస్‌కు సోమవారం రాత్రి బయలుదేరిన ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో సుమారు 2,100 కిలోల బ్లాక్ పెప్పర్‌ను ఈ సేవ ద్వారా పంపించారు. దేశాభివృద్ధికి సహకరించే విధంగా ప్రభుత్వ రంగ సంస్థలు కలిసి జాయింట్ పార్సిల్ ప్రొడక్ట్ సేవలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. రైల్వే, పోస్టల్ శాఖలు కలిసి పలు ప్రాంతాల్లో ఇప్పటికే ఈ సేవలు ప్రారంభించాయి. కాగా.. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు ఈ సేవలు ఉపయుక్తంగా నిలుస్తాయని డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి తెలిపారు. డివిజన్ పరిధిలో ఈ సేవలను ప్రారంభించిన అధికారులను అభినందించారు. కార్యక్రమంలో డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అవినాష్ శర్మ, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ ఆర్.రాహుల్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ డబ్ల్యూ నాగ ఆదిత్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ రావు కన్నుమూత



సీతమ్మధార: ద్వారకానగర్ 5వ లైన్ వెంకటేశ్వర టవర్స్‌లోని నివాసం ఉంటున్న విశ్రాంత ఐఈఎస్, ప్రజాస్పందన అధ్యక్షుడు చాగంటి సుందరరావు(94) బుధవారం తెల్లవారుజామున నిద్రలో తుది శ్వాస విడిచారు. ఆయన ఆరేళ్లుగా నరాల బలహీనతతో బాధపడుతున్నారు. విజయనగరం జిల్లా నిడిగట్టులో జన్మించిన ఆయన ఏయూలో ఆర్థికశాస్త్రంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. ఇండియన్ ఎకనామిక్ సర్వీస్ మొదటి బ్యాచ్ అధికారి. ప్రణాళిక సంఘంలో పని చేశారు. గ్రామీణ వికాసం, గ్రీన్ రివల్యూషన్, గోవా పోర్టు అభివృద్ధి, ఒడిశాలో సబాయ్ గ్రాస్ పరిశ్రమ, బ్రహ్మపుత్ర వేలీలో వరి సాగు, తమిళనాడు, కేరళ, కర్నాటకలో కర్రబొమ్మల పరిశ్రమకు చేయూత ఇలా ఎన్నో ప్రజాహిత కార్యక్రమాల్లో తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించారు. పదవీ విరమణ అనంతరం రావు విశాఖలో స్థిరపడ్డారు. ప్రజాస్పందన సంస్థను స్థాపించి.. ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారు. వైఎస్సార్ పార్కు ఏర్పాటులో చురుగ్గా వ్యవహరించారు. స్టేషన్ రోడ్డులోని మర్రిచెట్టు నరికేయకుండా కాపాడారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. ఆయనకు కుమారులు దక్షిణామూర్తి, జోగారావు, విశ్వనాథరావు ఉన్నారు.

ముస్తాబవుతున్న స్టేడియం

- 19న భారత్– ఆస్ట్రేలియా వన్డే మ్యాచ్
- జోరుగా బ్లాక్‌లో టికెట్ల విక్రయాలు!



క్రికెట్ స్టేడియం వద్ద కౌంటర్లలో సోల్డ్ అవుట్ బోర్డులు

పీఎంపాలెం: భారత్–ఆస్ట్రేలియా వన్డే మ్యాచ్‌కు వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియం ముస్తాబవుతోంది. ఇరు జట్ల మధ్య ఈ నెల 19న డేనైట్ వన్డే మ్యాచ్ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్ కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో టికెట్ విక్రయాలు ఇప్పటికే పూర్తయ్యాయి. ఆన్‌లైన్‌లో పేటీఎం యాప్ ద్వారా ఆఫ్‌లైన్‌లో నగరంలోని మూడు ప్రాంతాల్లో విక్రయాలు జరిపారు. బుధవారం కూడా కొంతమంది క్రికెట్ అభిమానులు టికెట్ల కోసం స్టేడియం వద్దకు చేరుకున్నారు. అయితే కౌంటర్ల వద్ద సోల్డ్ అవుట్ బోర్డులు చూసి నిరాశతో వెనుదిరిగారు. ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకున్న వారికి ఆధార్‌తో ఫిజికల్ టికెట్లు అందజేశారు. కాగా.. ఈ మ్యాచ్‌కు పోలీస్ శాఖ గట్టి నిఘా పెట్టింది. మ్యాచ్‌ను తిలకించేందుకు విశాఖ నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో క్రికెట్ అభిమానులు రానున్నారు. ఈ నేపథ్యంలో భారీ భద్రత ఏర్పాట్లలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇరుదేశాల క్రీడాకారులు, మ్యాచ్‌ను తిలకించడానికి వచ్చే ప్రముఖులు, క్రీడాభిమానుల భద్రతపై దృష్టి సారించారు. స్టేడియం వద్ద మునుపెన్నడూ లేని విధంగా ఎత్తైన బారికేడ్లు ఏర్పాటు చేశారు. స్టేడియంలోకి ప్రవేశించే ప్రేక్షకుల కోసం ప్రత్యేకంగా బారికేడ్లు సిద్ధం చేశారు. టికెట్ ఉన్న వారికి మాత్రమే స్టేడియం ఆవరణలోకి ప్రవేశం ఉండేలా చర్యలు చేపట్టారు. మరోవైపు బ్లాక్ టికెట్ల అమ్మకాలు జోరుగా సాగినట్లు తెలిసింది. అయితే నగదు బదిలీ అంతా యూపీఐ యాప్‌ల ద్వారానే సాగింది. రూ.1,500 టికెట్ రూ.2,500కు, రూ.2,000 టికెట్‌ను రూ.3,000 విక్రయించినట్లు సమాచారం.

డిప్యూటీ మేయర్‌కు క్రికెటర్ల స్వాగత బాధ్యతలు



గోపీనాథ్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈ నెల 19న జరిగే వన్డే మ్యాచ్‌లో భాగంగా విమానాశ్రయంలో క్రికెటర్ల స్వాగత బాధ్యతలను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు అప్పగించారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి ఆయనకు నియామకపత్రం అందించారు. ఈ బాధ్యతలు అప్పగించిన ఏసీఏ అధ్యక్షుడు పి.శరత్‌చంద్రా రెడ్డి, కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డిలకు డిప్యూటీ మేయర్ కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం జగన్ విశాఖ వచ్చేస్తే.. తొలి పుష్పగుచ్ఛం నేనే ఇస్తా..

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశాఖ వచ్చేస్తే తానే వెళ్లి తొలిపుష్పగుచ్ఛం అందిస్తానని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు వెల్లడించారు. బుధవారం ఆయన లాసన్స్ బే కాలనీలోని పార్టీ నగర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ జూలైలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ వచ్చేయడంతోపాటు పరిపాలన వ్యవహారాలు ఇక్కడి నుంచే కొనసాగిస్తామని చెబుతుండడంపై మీ స్పందన ఏంటని విలేకరులు అడిగిన ప్రశ్నకు విష్ణుకుమార్‌రాజు పైవిధంగా స్పందించారు. విశాఖ కేంద్రంగా పరిపాలన చేసేందుకు ముఖ్యమంత్రి నగరానికి వస్తే తొలుత నేనే వెళ్లి పుష్పగుచ్ఛం ఇస్తానంటూ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో పెద్ద ఎత్తున లోపాలు, అవకతవకలు జరిగాయని ఆరోపించారు. నకిలీ ఓట్లు ఎక్కువగా నమోదయ్యాయని ఆరోపించారు. ఓటింగ్ సమయంలో ఓటర్లకు సౌకర్యాలు కల్పించడంలో యంత్రాంగం విఫలమైందన్నారు. వైఎస్సార్‌సీపీ ఈ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ప్రలోభాలకు పాల్పడిందని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు వెల్లడించిన విధంగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పాలనను వ్యతిరేకించే పార్టీలతో బీజేపీ పొత్తు పెట్టుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.